క్లుప్తంగా

పంటల నమోదు పరిశీలన



పంటల నమోదు పరిశీలనలో ఎంఏవో

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో శుక్రవారం ఎంఏవో ప్రణిత యాసంగిలో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా 20 సర్వేనంబర్లకు సంబంధించిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో నమోదుచేశారు. అనంతరం వరిపంటలకు మోగి పురుగు సోకితే తీసుకోవాల్సిన జాగ్రత్తపై వివరించారు. వరిపొట్టదశలో ఉన్నపుడు యూరియా పోటాష్ ఎరువులు వాడాలన్నారు. చీడల పీడల నివారణ పురుగు మందులపై అవగాహన కల్పించారు. ఏఈఓ రజిత వెంట ఉన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

ఇల్లంతకుంట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ పాలక్ ఎర్రం మహేశ్ అన్నారు. మండలంలోని వెల్జిపూర్‌లో బీజేపీ శక్తికేంద్ర కార్నర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దళితులకు మూడెకరాల భూమి,దళితబంధు, ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, వంటి హామీలన్ని సీఎం కేసీఆర్ తుంగలో తొక్కారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి, దౌౌట్టి శ్రీనివాస్, బత్తిని స్వామి, పర్శరాం, అశోక్, రమేశ్, శ్రీనివాస్, మోహన్, ప్రసన్న, కర్ణాకర్ ఉన్నారు.

ఖదీర్‌ఖాన్ మృతిపై విచారణ జరిపించాలి



వినతిపత్రం ఇస్తున్న ముస్లిం యువకులు

గంభీరావుపేట: మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గంభీరావుపేట ముస్లిం యువకులు శుక్రవారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గత నెలలో ఖదీర్ ఖాన్‌పై పోలీసులు దొంగతనం కేసులో అనుమానితుడిగా పరిగణించి, అతనిపై పోలీసులు విచక్షణ రహితంగా ప్రవర్తించారని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు.

డీఈవోకు సన్మానం



పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఆర్వో

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల డీఈవోగా ఆరున్నరేళ్లు సేలందించి బదిలీపై వెళ్తున్న డా. ధనాలకోట రాధాకిషన్‌ను డీపీఆర్వో మామిండ్ల దశరథం శుక్రవారం సన్మానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రథమ డీఈవోగా రాధాకిషన్ విద్యారంగంలో విశేష సేవలందించారని కొనియాడారు.

కొనసాగుతున్న ఆందోళన



ధర్నా చేస్తున్న బాధిత రైతులు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ఫుడ్ ఫ్యాక్టరీ భూబాధిత రైతులు చేపట్టిన ఆందోళన ఐదో రోజుకు చేరింది. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ రైతులు ధర్నా చేస్తున్నారు. భూసేకరణ చట్టంప్రకారం న్యాయంచేయాలని రైతులు కోరారు. ఫుడ్ ఫ్యాక్టరీ కోసం తమ నుంచి సేకరించిన భూములకు చట్టంప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఐలమ్మ విగ్రహానికి శంకుస్థాపన



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ జెడ్పీపాఠశాలలోని గేటు ముందు నూతనంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి శుక్రవారం ఏపీపీ పిల్లి రేణుక శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధరపు పుష్పల, ఉపసర్పంచ్ బాలయ్య, రజక సంఘం నాయకులు పెద్దూరి కిష్టయ్య, ఎండపల్లి భూపతి, అనంతరెడ్డి, కృష్ణహరి, వెంకట్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, సత్తయ్య, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పత్తాలేని గ్రంథాలయం

- మండల కేంద్రంలో అందుబాటులో లేని వైనం
- ఇబ్బందులు పడుతన్న పోటీ పరీక్షల అభ్యర్థులు
- పన్నుల వసూళ్లలో మాత్రం గ్రంథాలయ సెస్
- గ్రంథాలయం ఏర్పాటు చేయాలంటున్న మండల వాసులు



మూతబడిన తంగళ్లపల్లి గ్రంథాలయం



1990లో ఏర్పాటు చేసిన శిలాఫలకం



వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్ను రశీదు

తంగళ్లపల్లి: గ్రంథాలయాలు మేధా సంపత్తికి దేవాలయాలు అంటారు. అలాంటి గ్రంథాలయాలు అందుబాటులో లేక ఇటువిద్యార్థులు, అటు పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికి సాక్ష్యంగా తంగళ్లపల్లి మండలకేంద్రంలోని శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఇక పల్లెల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. గ్రంథాలయాల గాలి కూడా రాదు కానీ ఇంటిపన్నులో మాత్రం గ్రంథాలమాల పేరిట పన్నులు మాత్రం చెల్లించాల్సిందే. గ్రామపంచాయతీ అధికారులు ముక్కుపిండి మరి గ్రంథాలయ పన్నులు వసూళ్లు చేస్తున్నారు. రూ.లక్షలకు లక్షలు వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్నులు ఎవరి జేబులోకి వెళ్తున్నాయని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. విలువైన పుస్తకాల సంగతి దేవుడెరుగు కనీసం దినపత్రికలు కూడా ఎక్కడా ఏర్పాటుచేసిన దాఖలాలు కనిపించడం లేదని బాహాటాగానే విమర్శిస్తున్నారు.

పోటీ పరీక్షలకు ప్రోత్సాహమేది?

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రభుత్వం గ్రంథాలయాలు ఏర్పాటుచేయాల్సి ఉండగా ఆదిశగా ఆలోచన చేయడం లేదని, శిథిలమైన భవనాల్లో ఇప్పటికీ గ్రంథాలయాలను కొనసాగించాల్సి వస్తోందని దీంతో పాఠకులు, విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీచేసిన నేపథ్యంలో లక్షల సంఖ్యలో అభ్యర్థులు ఉద్యోగాలకు పోటీపడుతున్నారు. ఉద్యోగం సాధించాలంటే పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే.. కానీ అక్కడే నిరుపేద అభ్యర్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రంథాలయాలు అందుబాటులో ఉంటే వేలల్లో డబ్బులు ఖర్చుచేసి పోటీపరీక్షల పుస్తకాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతోపాటు గ్రంథాలయాలు ఉంటే వారు చదువుకునేందుకు ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. మండలకేంద్రంలో కూడా గ్రంథాలయం అందుబాటులో లేకపోవడంతో గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు జిల్లా గ్రంథాలయం వైపు చూడాల్సి వస్తోంది. అక్కడేమో చోటు దొరకడమే కష్టంగా మారింది.

గ్రంథాలయాన్ని మూసేశారు..

తంగళ్లపల్లి మండలకేంద్రం కాకముందు 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'ప్రేమ సమాజ గ్రంథాలయం' పేరుతో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీ.ఎం.సి.బాలయోగి గ్రంథాలయాన్ని 1990 జూలై 1న ప్రారంభించారు. ప్రస్తుత సర్పంచ్ అంకారపు అనిత అప్పుడు ఎంపీటీసీగా ఉన్నారు. ప్రారంభించిన కొన్ని సంవత్సరాలు బాగానే పనిచేసినప్పటికీ.. కాలక్రమంలో ఆ గ్రంథాలయాన్ని పట్టించుకునే వారు లేక క్రమేపి పుస్తకాల సంఖ్య తగ్గిపోయి, పాఠకులు దూరమై ప్రస్తుతం పూర్తిగా మూసివేశారు. కరెంటు కనెక్షన్ కూడా గ్రంథాలయం కరెంట్ బిల్లులు వసూళ్లు చేసేందుకు, కరెంటు సామగ్రిని నిల్వచేసేందుకు గోదాంగా మారిపోయింది. 33 ఏళ్ల కింద నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రస్తుతం పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది.

గ్రంథాలయం నిర్మించాలి

తంగళ్లపల్లి మండలకేంద్రంలో ప్రస్తుతం విశాలమైన అద్దెభవనాన్ని తీసుకుని గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి అందులో పోటీ పరీక్షలతోపాటు, మహాత్ముల జీవిత చరిత్రలు, చారిత్రాత్మక పుస్తకాలు అందుబాటులో ఉంచాలని మండల యువత, పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కోరుతున్నారు. తాత్కాళిక గ్రంథాలయం ఏర్పాటుతోపాటు పక్కాగ విశాలమైన సొంత గ్రంథాలయం పనులు చేపట్టి వీలైనంత త్వరగా పూర్తిచేసి అందులో డిజిటల్ లైబ్రెరీ తోపాటు అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



నేను గ్రూప్–2 పరీక్షలకు సిద్ధం అవుతున్నాను.. గ్రూప్స్‌కు సంబంధించిన అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో లేవు. మండల కేంద్రంలో గ్రంథాలయం ఉంటే నాలాంటి అభ్యర్థులకు చాలా ఉపయోగంగా ఉండేది.

– మునిగెల సింధూజ, గ్రూప్2 అభ్యర్థి సారంపల్లి

పన్ను ఎందుకు చెల్లించాలి..



తంగళ్లపల్లి మండలకేంద్రంగా మారి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు గ్రంథాలయం అందుబాటులో లేకపోవడం శోచనీయం. గ్రంథాలయం పేరుతో పన్నులు మాత్రం బాగానే వసూలు చేస్తున్నారు. సేవలు లేనపుడు పన్నులు ఎందుకు చెల్లించాలి.

– చుక్క రాజశేఖర్, తంగళ్లపల్లి

అందుబాటులోకి తెస్తాం



మండలకేంద్రంలో మూతబడిన గ్రంథాలయాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. అందుకోసం జిల్లా గ్రంథాలయ చైర్మన్ సహకారం తీసుకుంటాం. ప్రస్తుత భవనంలో మరమ్మతులు చేసి అందుబాటులోకి తెస్తాం.

– అంకారపు అనిత, సర్పంచ్ తంగళ్లపల్లి

వైద్యశిబిరం..విజయవంతం

సిరిసిల్లటౌన్: సామాజిక సేవల్లో భాగంగా కరీంనగర్‌కు చెందిన ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు శుక్రవారం సిరిసిల్ల ఎస్బీఐ ప్రధాన కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించగా.. విజయవంతమైంది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం వరకు బ్యాంకు అధికారులు, కస్టమర్లకు ఉచితంగా వైద్యసేవలు, ఆరోగ్యపరీక్షలు చేశారు. బ్యాంకు చీఫ్‌మేనేజర్ వీరాంజనేయులు, డెప్యూటీ మేనేజర్ రాజేంద్రప్రసాద్, పర్శరాములు, కృష్ణయాదవ్, అమీర్‌ఖాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస అన్నారు. తంగళ్లపల్లి మండలంలోని మండేపల్లిలో శుక్రవారం కంటివెలుగు కేంద్రాన్ని జెడ్పీటీసీ పూర్మాణి మంజులతో కలిసి ప్రారంభించారు. మార్చి 14 వరకు కంటివెలుగు వైద్యశిబిరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివజ్యోతి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, ఎంపీటీసీ స్వప్న, వైద్యాధికారులు, తదితరులు ఉన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి, దుమాల గ్రామాల్లో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించి గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. గొర్రెలు వ్యాధులకు గురికాకుండ ముందస్తుగా నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారి రేణుక తెలిపారు. ఈ అవకాశాన్ని గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముక్క మధుకర్, కదిరె రజిత, నాయకులు దేవేందర్, రాజమల్లయ్య, రాములు, మల్లేశం, కొమురయ్య, కార్యదర్శి జాపర్, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఐదోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



కళాశాల ఎదుట మాట్లాడుతున్న రంజిత్

వేములవాడఅర్బన్: వైద్య విద్యార్థిని ప్రీతికి జరిగిన అన్యాయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ కళాశాల ముందు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రీతి, సైఫ్ వేధింపులకు తాళలేకే తండ్రికి, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌వోడీకి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయంపై పోలీసులు స్పందించి సైఫ్‌ను మందలిస్తే ఈ ఘటన జరిగేది కాదన్నారు. సైఫ్ డాక్టర్ పట్టాను రద్దుచేసి, చట్టప్రకారం హత్యాయత్నం కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో అరవింద్, జావేద్, అరుణ్, సంజీవ్, వినయ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలని, ప్రణాళికతో చదివి విజయం సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ సూచించారు. ఈ సందర్భంగా వేములవాడ అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఆటిట్యూడ్, రిజనింగ్ అనే అంశంపై విద్యార్థులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు ఉద్యోగ ప్రగతిలో సృజనాత్మకత, క్లిష్టమైన ఆలోచన విధానం, నాయకత్వ లక్షణాలు, సానుకుల వైఖరి కలిగి ఉండాలన్నారు. సిరిసిల్ల టాస్క్ మేనేజర్ గూడురి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగసాధనలో మానసిక సామర్థ్యం, యోగ్యత అవసరమన్నారు. తెలంగాణలో గ్రూప్ పరీక్షలకు, ఇతర పోటీ పరీక్షలకు ఈ అంశాలపై పట్టు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, దాసరి సాగర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అంతిమ సంస్కారాలకు అధిక భారం

- శ్మశానవాటికల్లో ధరలు ఎత్తివేయాలి
- కరీంనగర్ తరహాలో రూ.1 అంతిమ సంస్కారాలు పూర్తిచేయాలి
- సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ సొంత జిల్లాలోని శ్మశానవాటికల్లో అంతిమ సంస్కారాల నిర్వహణకు ప్రజలు అధిక భారం మోయాల్సి వస్తోందని సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ శ్మశానవాటిక సమితి సభ్యులు శుక్రవారం పరిశీలించిన అనంతరం సిరిసిల్లలో ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. కరీంనగర్‌లో రూ.1కే అంతిమ సంస్కారాలు నిర్వహించేలా అక్కడి మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇదే పద్ధతిని సిరిసిల్లలో కూడా కొనసాగించాలని కోరారు. ఈ మేరకు సమితి సభ్యులు తీర్మాణం చేసి మంత్రి కేటీఆర్, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు వేముల సత్యనారాయణ, గజభీంకార్ మల్లాజీ, కుసుమ గణేశ్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యాసన దీపికలు పంపిణీ



విద్యార్థులకు దీపికలు అందిస్తున్న హెచ్‌ఎం, సర్పంచ్

ఎల్లారెడ్డిపేట/చందుర్తి: ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ జెడ్పీపాఠశాలలో పదోతరగతి విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రభుత్వం అందించిన అభ్యాసన దీపికలను సర్పంచ్ రాధారపు పుష్పలవిద్యార్థులకు అందించారు. చందుర్తి మండలం సనుగుల జెడ్పీ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు సర్పంచ్ లింగంపల్లి కరుణాకర్, హెచ్‌ఎం గుర్రం మల్లారెడ్డి అభ్యసన దీపికలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అభ్యాసన దీపికలను క్షుణ్ణంగా చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పద్మ, ఉపసర్పంచ్ బాలయ్య, హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ బొల్లిపల్లి మధు, ఉపాధ్యాయులు , విద్యాకమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు తెర!



శాత్రాజుపల్లిలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల (ఫైల్)



వేములవాడలో ప్రస్తుతం కొనసాగుతున్న పశువైద్యశాల (ఫైల్)

- ఎట్టకేలకు భవనాలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

వేములవాడరూరల్: మూగజీవులకు వైద్యం అందించేందుకు పశువైద్యశాలలు లేకపోవడంతో చాలా ఏళ్లుగా రైతులు, వైద్యసిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. శిథిలమైన భవనాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులుపడుతూ కాలం వెల్లదీస్తున్నారు. అలాంటి రెండు భవనాలకు ప్రభుత్వం ఎట్టకేలకు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో భవనం కోసం, మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతమున్న 1వ వార్డులో ఈ రెండు భవనాలు నిర్మించేందుకు పట్టణానికి రూ. 51లక్షల, శాత్రాజుపల్లికి రూ.41 లక్షలు మంజూరుకు ఉత్తర్వులు వచ్చినట్లు పశువైద్యాధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు రూరల్ గ్రామాల్లో హన్మాజిపేటలో మాత్రమే పశువైద్యశాల నూతన భవనం ఉంది. ఇక పట్టణంతో పాటు శాత్రాజుపల్లిలో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనంలోనే నేటికీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై చాలా సందర్భాల్లో రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని పశువైద్యశాల మంజూరుకు సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరుకు కృషిచేశారు. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని మండల అధికారులు తెలిపారు.

సంతోషంగా ఉంది



మా వార్డులో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన పాత భవనంలోనే పశువైద్యశాల ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. నేడో రేపో కూలిపోయే స్థితిలో ఉన్న ఈ భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తూ చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్యకాలంలోనే ఆ భవనం ఖాళీ చేసి పాఠశాల ఆవరణలో విధులు నిర్వహిస్తున్నారు. నూతన భవనం మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– సతీశ్‌రెడ్డి, రైతు, 1వ వార్డు, శాత్రాజుపల్లి

హర్షనీయం..



చాలా ఏళ్లుగా పశువులకు భవనాలు లేక శిథిలావస్థలో కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలు, ఉద్యోగుల సమస్యలు తీరనున్నాయి.

– దుర్గపు మహేశ్, రైతు, ఫాజుల్‌నగర్

రెండు భవనాలు మంజూరు



వేములవాడ పట్టణం, శాత్రాజుపల్లి వార్డులోని పశువైద్యశాలలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. రూ.92 లక్షలతో కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. టెండరు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కారం కానుంది.

– ప్రశాంత్, పశువైద్యాధికారి, వేములవాడ

ఘనంగా మహాలక్ష్మీ కల్యాణం, బోనాలు



కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద అర్చకులు ఘనంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆద్య ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్, సర్పంచ్ ఆరె లత మహేందర్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కుంట శ్రీనివాస్, నాయకులు జంగిడి బుగ్గయ్య, వేల్పుల తిరుపతి, మహిపాల్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబాద్: మండలంలోని గూడెం పురాతన శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. శ్రీమధుసూదననంద సరస్వతీ ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, రవి, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ఎల్లమ్మ గుడి సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మామిడిపల్లికి చెందిన లోకుర్తి తిరుపతి సిరిసిల్ల నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. నిజామాబాద్ ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో కల్వర్టుకు ఢీకొనడంతో పక్కనే ఉన్న పొలంలో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.